# ప్రేమ-పెళ్ళి

-ఎం.వెంకటేశ్వరరావు

"హలో! కావ్యా! నేను శ్రీరాం"

"హలో"

"కావ్యా! నాకు జ్వరంగా ఉంది. ఇంటికెళ్తున్నాను. సాయంత్రం నాకోసం ఎదురుచూడకుండా ఆటోలో వచ్చెయ్" అన్చెపుతుంటే...

"శ్రీ...ఇప్పుడెలా ఉంది. నేనూ లీవు పెట్టి వచ్చెయ్యనా?"

"టాబ్లెట్స్ వేసుకున్నాను. ఇంటికెళ్లి రెస్ట్ తీసుకుంటాను. ఎండ ఎక్కువగా ఉంది. ఇంత ఎండలో రావొద్దు" అని సెల్ స్విచ్ఛాఫ్ చేసి, డాక్టర్ మధు ఛాంబర్‌లో కెళ్ళాను.

"సార్! ఐయాం నాట్వెల్. ఐ అరేంజ్డ్ డాక్టర్ తనూజ టు లుక్ ఆఫ్టర్ మై డ్యూటీ"

"ఓ.కె. శ్రీరాం టేక్ కేర్" అని మ్రోగుతున్న ఫోన్ రిసీవర్ అందుకున్నాడాయన.

కారు తీసుకుని ఇల్లు చేరేసరికి అరగంట పట్టింది. కారు పార్కు చేసి, లెటర్ బాక్సులో లెటర్స్ తీసుకున్నాను. నాకు రెండు, కావ్యకి ఒకటి వచ్చాయి. లోపలి కెళ్ళి డ్రెస్ ఛేంజ్ చేసుకొచ్చి, సోఫాలో కూచుని లెటర్సు తీసుకున్నాను.

ముంబయ్ నుండి అన్నయ్య రాసిందొకటి, కావ్యకి వచ్చిన లెటరు బరువుగా ఉంది. ఫ్రమ్ అడ్రస్ లేదు. దానికి బదులు ఏదో కోడ్. కావ్య పేరు మాత్రం అందంగా రాసుంది. లెటర్స్ టేబుల్స్ మీదుంచి సోఫాలో పడుకున్నాను. సాయంత్రం నాలుగ్గంటలకి కాలింగ్ బెల్ మ్రోగేసరికి, లేచి తలుపుతీసాను. ఎదురుగా కావ్య.

"టైమెంతైంది?'' అన్నాను.

"నాలుగు'

"అప్పుడే వచ్చావేం?''

"పర్మిషన్ పెట్టొచ్చాను. ఎలా ఉంది జ్వరం'' అంటూ నా పక్కన కూచుని నుదురు పట్టుకుని చూసింది.

"ఉండండి కాఫీ తెస్తాను'' అని లోపలికెళ్ళింది. ఐదు నిమిషాల తర్వాత కావ్య ఇచ్చిన వేడి వేడి కాఫీ తాగుతుంటే, రిలీఫ్ అన్పించింది.

"డల్‌గా ఉన్నావు. ఏమైనా టిఫిన్ చెయ్యనా?''

"ఏం వద్దు. కాసేపు పడుకుంటాను''

"తలనొప్పిగా ఉందా? బామ్ రాయనా?''

"అలా చేస్తే బెటరు. టేబిల్ మీద నీకో లెటరుంది తీసుకో'' అని పడుకున్నాను.

లెటరు తీసుకుని బామ్ తెస్తానని లోపలికెళ్ళిన కావ్య అరగంటైనా రాకపోయేసరికి పిలిచాను. బదుల్లేదు. లేచి లోపలికెళ్ళాను. కావ్య దిండులో తలదాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

కంగారుగా ఆమె పక్కన కూచుని "ఏమైంది కావ్యా? ఎందుకేడుస్తున్నావు'' అన్నాను లాలనగా భుజం మీద చెయ్యేసి, పక్కకి తిప్పి.

"ఎక్కణ్ణుంచి లెటరు? మీ ఇంట్లో వాళ్ళకెవరికైనా బాగుండలేదా? ఏమిటో చెప్పు'' అన్నాను.

ఏడ్చి ఏడ్చి ఎర్రగా కందిపోయిన మొహాన్ని పైకెత్తి, దిండు కిందున్న లెటర్ తీసి నాకు ఇచ్చింది.

"దీన్ని చదవండి. ఐయాం సారీ. పెళ్ళికి ముందు నేను, రఘు ఎం.సి.ఎ. చదువుతూ ఒకర్నొకరు ఇష్టపడ్డాం. కారణాలేవైనా పెళ్ళి వరకూ రాలేదా ప్రేమ. ఈ విషయం నేను మీతో చెప్పక పోవటం నా తప్పు. అతను రాసిందే ఈ లెటర్''

"నీకొచ్చిన లెటర్ నాకెందుకిస్తున్నావ్''

"చదవడానికి''

"ఇంకొకళ్ళ లెటర్స్ చదివే అలవాటు నాకు లేదు''

"నేనేగా చదవమంటోంది. మీరు చదివితే..నాకు ఊరట'' అని చివాల్న లేచి ఆ లెటరు నా చేతుల్లో ఉంచింది.

ఆపై ఆమెతో రెట్టించడం ఇష్టంలేక, లెటర్ తీసుకుని హాల్లోకొచ్చి కూచున్నాను. లెటర్ మడతలు తీసి చదవడం మొదలెట్టాను.

"కావ్యా!

నీ జ్ఞాపక దీపికల్లో నేను శలభాన్నా? శకలాన్నా? శిలనా? లేక శవాన్నా?

'ప్రేమ' అనే రెండక్షరాల అణుబాంబు కోసం నా హృదయాన్ని ప్రయోగశాలలా మార్చుకుని, శోధించి, పరిశోధించి...వెళ్తూ, వెళ్తూ నా హృదయాన్ని మరో హిరోషిమాలా మార్చి వెళ్ళడం న్యాయమా? నా ప్రేమని భగ్నం చేసి, నల్గురి ముందు నీ ప్రేమ నగ్నం కాకూడదన్న స్వార్థంతో, పెద్దవాళ్ళు సృష్టించిన అంతస్థుల గోడల వెనక్కెళ్ళి నన్నొంటరిని చేసి మన ప్రేమ సమాధిపై పుష్పగుచ్ఛాన్నుంచెళ్ళావు. నీ తల్లిదండ్రుల పరువుకోసం నా ప్రేమకు నువ్వు సమాధి కడితే, మా అమ్మానాన్నలు తమని పున్నామ నరకం నుండి తప్పించేందుకు నాకు పెళ్ళి చేస్తామంటున్నారు. కాదంటున్న నన్ను కారణం అడుగుతున్నారు నాలో రగిలే రణం గురించి తెలియక. అందుకే ఈ పరిసరాల్నొదిలి, అమెరికాలో ఉంటున్న అక్కయ్య దగ్గర కెళ్దామనుకుంటున్న తరుణంలో...పోయిన వారం హాస్పిటల్ ముందు కన్పించావు. ఆర్నెల్లలో ఎంత మార్పు.

'అమ్మవు' కాబోతున్నావని గ్రహించాను. కంగ్రాట్స్. పెరిగిన గడ్డంలో దిష్టిబొమ్మలా ఉన్న నేను ఎదురుపడ్డా నన్ను పోల్చుకోలేకపోయావు. ప్రశాంతంగా ఉన్న నీ మనఃకొలనులో జ్ఞాపకాల రాళ్ళు పడితే, ఆ అలలు రేపే అలజడి నువ్వు తట్టుకోలేవు. అది నేనూ భరించలేను. చిన్న కోరిక, నేను ఇండియా వదిలి వెళ్ళేముందు ఓ మంచి స్నేహితురాల్లా నాకు వీడ్కోల్సు చెప్తావన్న ఆశతో ఈ లెటర్ రాస్తున్నాను.రేపు ఉదయం ఏర్పోర్ట్‌లో ఎదురుచూస్తుంటాను.

నీకు ఎప్పటికీ ఏమీ కాని- రఘు.''

లెటర్ చదివి ముగించేసరికి, మనసంతా

భారంగా మారింది. "కావ్యా! త్వరగా తయారవ్వు. బయటికెళ్దాం" అన్నాను.

"వద్దు..మీకసలే జ్వరంగా ఉంది"

"ఫర్వాలేదు. తగ్గింది. నేను రెడీ అవుతున్నాను" అన్నాను మరో మాటకి తావివ్వకుండా.

ఓ గంట తర్వాత బిర్లామందిర్ చేరుకున్నాం. దర్శనం చేసుకుని, ఓ కార్నర్‌లో కూచున్నాం.

మౌనంగా ఏదో తప్పు చేసినదానిలా తలొంచుకు కూచున్న కావ్యతో "పెళ్ళికి ముందు అతన్ని ప్రేమించినందుకేనా..ఈ మౌనం" అన్నాను నవ్వుతూ.

"నామీద కోపం రావటం లేదా?"

"ఊహూ..నవ్వొస్తోంది. అసలు పెళ్ళికి ముందు యువతీ యువకుల్లో ఈ ఎట్రాక్షన్ కలగకపోతే అది 'యవ్వనం' ఎలా అవుతుంది. ఆ వయసులో ప్రేమించటమో, ప్రేమించబడటమో ఏదో ఒకటి జరగాలి. దీనిని ఆపటం ఎవరితరం గాదు. ఆ స్పందనలు కలగకపోతే యవ్వనం జడంలా మారిపోతుంది.పెళ్ళికి ముందు ఎవర్నీ ప్రేమించలేదనీ, ఎవర్ని చూసీ మనసు స్పందించలేదని పెళ్ళయిన వాళ్ళని మనస్సాక్షితో చెప్పమను.ప్రేమించిన ప్రతివాళ్ళూ పెళ్ళి చేసుకోలేరు. కట్టుబాట్ల మెట్లు, అంతస్తుల ఎత్తులు ఇలా ఏవో అవాంతరాలు. వీటన్నిటికి అతీతంగా స్త్రీ జీవితాన్ని 'వివాహం' ఓ మలుపు తిప్పుతుంది. మనసా, వాచా, కర్మణా భర్తకి పరిపూర్ణంగా జీవితాన్ని అర్పిస్తుంది. భర్త ద్వారా మాతృత్వపు మాధుర్యాన్ని పొంది, సంపూర్ణ గృహిణిగా మారుతుంది. ఇదే మన వివాహ వ్యవస్థలో ఉన్న గొప్పతనం.శారీరకంగా, మానసికంగా భార్యాభర్తలు సంతృప్తికర జీవితానికి అలవాటు పడినప్పుడు గతకాలపు జ్ఞాపకాలు మరుగునబడతాయి. సహజమైన దీన్ని అసహజంగా ఊహించుకుని భార్యని హింసించే కుసంస్కారం నాకు లేదు. ఆర్నెల్ల సాంగత్యంలో ఎన్నో మధురానుభూతుల్ని పంచుకున్న మనం, ఇలాంటి సిల్లీ కారణాలకి మానసిక ప్రశాంతతని భగ్నం చేసుకోవద్దు.ఇద్దరం రేపు ఉదయం ఏర్‌పోర్ట్‌కెళ్ళి రఘుకి వీడ్కోలు చెబుదాం. లే! ఎక్కువగా ఆలోచించకు. హోటల్లో తినెళ్దాం" అన్నాను లేచి నుంచుని ఆమెకి చెయ్యందిస్తూ.

తుపాను తర్వాత ప్రశాంతత కావ్య మొహంలో కొట్టొచ్చినట్టు కన్పించింది బిర్లామందిర్ లైట్ల వెలుగులో.

★

